క్లుప్తంగా

ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏఈ శ్రీనాథ్‌రెడ్డి

కల్లూరు: తాగు నీటికి ఇబ్బందులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారు. అందుల్లో భాగంగా పెద్దటేకూరు గ్రామంలో నిర్మిస్తున్న 40 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకు పనులను సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి పరిశీలించారు. సకాలంలో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

ఆర్.ఖానాపురంలో గడ్డి వాములు దగ్ధం



కాలిపోయిన గడ్డివామును జేసీబీతో తొక్కిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: మండల పరిధిలోని ఆర్.ఖానాపురంలో సోమవారం రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి కళ్లందొడ్డిలో పశువుల మేత కోసం రూ.2 లక్షల విలువ చేసే గ్రాసాన్ని నిల్వ చేసుకున్నాడు. గడ్డి వాము పైన విద్యుత్ తీగలు తెగి పడటంతో మంటలు చెలరేగాయి. స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే మొత్తం కాలి బూడిద అయ్యింది.

ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందించాలి



గుడిపాడులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి

గూడూరు రూరల్: ఆర్‌బీకేల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి సూచించారు. పెంచికలపాడు, గుడిపాడులోని ఆర్‌బీ కేంద్రాలు, రైతులు సాగు చేసిన పంటలను సోమవారం ఏడీఏ సాలురెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాన్నారు. ప్రస్తుతం శనగ పంటలకు మద్దతు ధరకు రైతులు అమ్ముకునేలా చూడాలన్నారు. పంట మార్పుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి, ఏఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'శాంతిరాం' విద్యార్థుల ప్రతిభ

పాణ్యం: 'ప్రదర్శన్ -2023'లో తమ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారని మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ నాల్గవ ఏడాది చదువుతన్న యశశ్విని, లక్ష్మీసరస్వతి ఈనెల 25న గుంటూరులోని విజ్ఞన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రదర్శన్-2023'లో 'ఆటోమెటిక్ మానిటరింగ్ అండ్ సిలిండర్ బుకింగ్ సిస్టమ్ బెస్ట్ ఆన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్ వర్క్ ప్రాజెక్టు తయారు చేశారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు టెక్నికల్ కోర్సుల్లో ప్రతిభ చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగ అధిపతి మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు విక్రయించుకోండి

గడివేముల: కొనుగోలు కేంద్రాల్లో దిగుబడులను మద్దతు ధరకు విక్రయించుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని కరిమద్దెల, పెసరవాయి, బిలకలగూడూరు, చిందుకూరు, గడిగరేవుల, కొరటమద్ది గ్రామాల్లోని ఆర్బీకేలను తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ జొన్నలు, శనగలను మద్దతు ధరకు విక్రయించుకోవడానికి రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జొన్న క్వింటాకు రూ. 2970, శనగలు క్వింటా రూ.5,330 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు సుంకన్న, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భానుడు భగభగ

- రోజురోజుకు పెరుగుతున్న ఎండలు
- అల్లాడుతున్న ప్రజలు



ఎండల తీవ్రతకు పాణ్యం బస్టాండ్‌లో ప్రజలు లేక నిర్మానుష్యంగా మారిన దృశ్యం

పాణ్యం: రోజురోజుకు ఎండలు తీవ్రమవుతన్నాయి. పది రోజుల క్రితం 30 డిగ్రీలు నమోదైన ఎండలు రెండు రోజుల నుంచి 35 డిగ్రీలకు చేరుకుంది. ప్రజలు ఎండలకు తారెత్తిపోతున్నారు. ఎక్కడ నీడ దొరికితే అక్కడే ఉండి సేద తీరుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు, ప్రజలకు ఎండల తీవ్రత వలన వచ్చే వడదెబ్బ, ఇతర నష్టాలపై డాక్టర్లు ఇప్పటికే అవగాహన కల్పించారు.

12 గంటలకే పనులు ముగించుకోవాలి..

ప్రస్తుతం పరిస్థితిలో బయటకు వెళ్లిన వారు తప్పకుండా మధ్యాహ్నం 12 గంటల్లోపు తిరిగి రావాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అత్యవసరమైతే 4.30 నుంచి 5 గంటల వరకు బయటకు వెళ్లవచ్చని చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులను ఎండల తీవ్ర ఉన్న సమయంలో బయటకు పంపవద్దని అంటున్నారు.

పండ్ల రసాలే ఆరోగ్యానికి శ్రేయస్కరం..

ఎండా కాలంలో అధికంగా మంచినీటిని తాగాలి. వీటితో పాటు కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు(ఐస్ లేకుండా) తాగితే మంచింది. సాధారణంగా రోజుకు రోజు 4-5 లీటర్ల నీటిని తాగవచ్చు. ఎండా కాలంలో 5-7 లీటర్ల నీటిని తీసుకోవచ్చు. వీలైనంత వరకు కూలింగ్ నీటిని తక్కువగా తీసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఈ ఎండా కాలంలో ఆయిల్ ఫుడ్‌కు కాస్తా దూరంగా ఉండి త్వరగా జీర్ణమయ్యే పదార్థాలను తీసుకోవాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ముదరుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధి కూలీలకు, ఇతర పనులకు బయటకు వెళ్లే కూలీలకు ఆయా వైద్య సిబ్బంది ద్వారా తెలియజేస్తున్నాం. ప్రజలు తప్పకుండా మంచినీటి అధికంగా తీసుకోవాలి. వడదెబ్బకు గురైతే ముందుగా వారిని నీడ ప్రదేశాల్లోకి తీసుకెళ్లి నీరుతాగించాలి. అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి. ఈ ఎండల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందుబాటులో ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు, మరిన్ని మందులను అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ భగవాన్‌దాస్, మద్దూరు పీహెచ్‌సీ

కాటన్ దుస్తులతో ఆరోగ్యం..

కాటన్ దుస్తులు ధరించాలి. అవి కూడా లేత రంగులో ఉండే దుస్తులైతే ఆరోగ్యానికి మరీ మంచిదని చెబుతున్నారు. శరీరానికి లూజుగా ఉండే దుస్తులు ధరించడం వలన గాలి తగిలి చెమట తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

కేసు నమోదు

కల్లూరు: మండల పరిధిలోని పుసులూరు గ్రామానికి చెందిన బాలిక కిడ్నాప్ అయినట్లు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. పుసులూరు గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 24న ఉదయం బహిర్భూమికి వెళ్లగా గ్రామానికి చెందిన పి.రమేష్ అనే వ్యక్తి కిడ్నాప్ చేశాడు. ఈ ఘటనలో రమేష్‌కు పి.నాగేంద్ర, పి.చల్లమయ్య సహకరించారు. వీరి ముగ్గురిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేర్లు నమోదు తప్పనిసరి

సి.బెళగల్: జొన్నపంట దిగుబడులు విక్రయించుకునేందుకు ఆర్బీలలో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. సోమవారం బురాన్‌దొడ్డి గ్రామ ఆర్బీకేలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఏఓ మల్లేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్వింటా జొన్నలు రూ.2970 లతో కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఆర్బీకేలను, వీఆర్వోలను సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీఆర్వో పాండురంగన్న, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి



పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సూచించారు. సోమవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరపున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన నిరు పేద కుటుంబాలకు ఇంటి వద్దకే అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నిరుద్యోగ, యువతీ, యువకుల బంగారు భవిష్యత్తుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని కోరారు. మార్చి 13న జరిగే ఎన్నికల్లో వీరి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ విభాగాలతో పాటు అభిమానులు కృషి చేయాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి యువత, ఉద్యోగులు ఓటుతో మద్దతు ఇవ్వాలని కోరారు.

గృహసారథులే రథసారథులు

- ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశానికి హాజరైన గృహసారథులు

ఓర్వకల్లు: గృహసారథులు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో రథసారథులుగా పని చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తేచ్చారన్నారు. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను, ముగ్గురు కన్వీనర్లను, ప్రతి వలంటీర్‌కు ఇద్దరేసి చొప్పున గృహసారథులను నియమించామన్నారు. వీరందరు సమన్వయంతో పనిచేసి అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఓర్వకల్లు ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు అనువుగా ఉండడంతో రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి జగన్ సహాయ సహకారాలు దోహదపడుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఐదు నియోజకవర్గాలలో సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతో రూ.1,500 కోట్లతో మల్లికార్జున రిజర్వాయర్ ఏర్పాటుకు అంగీకరించిన ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. ప్రజల చిరకాల కోరిక మేరకు ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, 2019-23 మధ్య కాలంలో వైఎస్సార్‌సీపీ భుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల మధ్య తేడాలను గమనించాలన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందో గుర్తుంచుకోవాలని సూచించారు. గృహసారథులు ప్రజల మధ్యకు వెళ్లి రాబోయే ఎన్నికల్లో మరో సారి జగనన్నను దీవించాలని ప్రజలను కోరాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, సర్పంచు తోట అనూష తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సునీలమ్మ

గూడూరు రూరల్: చదువుపై దృష్టి పెట్టి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ సునీలమ్మ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. మునగాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల నోట్ పుస్తకాలను ప్రతి రోజూ చెక్ చేసి తప్పులను సరి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి పరీక్షల సమయం దగ్గరపడుతుందని, ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా తయారు చేసేలా చూడాలని, ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించాలని చెప్పారు. అలాగే నాడు-నేడు కింద మంజూరైన నిధులతో నిర్మితమవుతున్న హైస్కూల్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, గడువులోగా పూర్తి చేయించాలని హెచ్‌ఎంకు సూచించారు.

రూపాల సంగమేశ్వరాలయం హుండీ కానుకలు లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు

కర్నూలు కల్చరల్: జగన్నాథ గట్టు ఉమా సమేత శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి భక్తులు కానుకలు చెల్లించారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరెడ్డి, కార్య నిర్వహణాధికారి వై.గురెడ్డి సమక్షంలో వాటి లెక్కింపు చేపట్టగా రూ.3, 12,233 ఆదాయం వచ్చింది. కౌంటింగ్‌లో దిన్నెదేవరపాడు గ్రామ సర్పంచ్ మాధవ్‌స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సర్వేశ్వర్‌రెడ్డి, శేషయ్య, అర్చకులు లంక సురేష్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఇతర అధికారులు

కర్నూలు(సెంట్రల్): బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్‌బీసీసీ(సోషల్ అండ్ బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్)సెల్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాల్య వివాహాల నివారణ, కౌమార బాలికలల్లో రక్తహీనత నిర్మూలన, మాతాశిశు మరణాలను తగ్గించడం, పాఠశాలలకు వెళ్లని విద్యార్థులను తిరిగి పంపడం ఎస్‌బీసీసీ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటైన ఎస్‌బీసీసీ కమిటీలను మండల స్థాయిలోనూ ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలు జరిపించడంతో పిల్లల బంగారు భవిష్యత్‌ను ఏ విధంగా నష్టపోతారో వీడియో రూపంలో చిత్రీకరించి ఆరోగ్య శాఖ మొబైల్ వాహనాల్లో క్షేత్రస్థాయిలో ప్రజలు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. అలాగే థియేటర్లలో స్లైడ్స్ రూపంలో వేయించాలని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్‌ను ఆదేశించారు. గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాలపై బాల్య వివాహాలతో జరిగే నష్టాలపై ఆడియో రూపంలో స్పీకర్ల ద్వారా తెలియజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయాల బయట ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ బోర్డులను డిస్‌ప్లే చేసే విధంగా చూడాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో ఆర్‌డీఓ హరిప్రసాద్, ఐసీడీఎస్‌పీడీ కుమారి, మెప్మా పీడీ శివలీల, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, డీఈఓరంగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్చరీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : క్రీడాకారులు లక్ష్యాన్ని ఎంచుకుని రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆర్చరీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపికయిన క్రీడాకారులు విజయవాడలో ఈనెల 28 నుంచి మార్చి 2 వ తేదీ వరకు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సి.బెళగల్ పార్కులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రాముడు హెచ్చరించారు. సోమవారం ఆయన ఇనగండ్ల గ్రామ ఆర్బీకేలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగునంగా వలంటీర్లు వ్యవహరించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ, సర్వేలను సకాలంలో పూర్తిచేసి, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. అలాగే కొండాపురం గ్రామ సచివాలయలంలో ఉద్యోగులతో సమావేశమై అంకితభావంతో విధులు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఉద్యోగులు ఫేషియల్ యాప్‌లో, వలంటీర్ల బయోమెట్రిక్ హాజరు నమోదు తప్పనిసరి చేసుకోవాలని, ప్రతి రోజు గ్రామ సచివాలయాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ సందీప్ పాల్గొన్నారు.

పార్కు తనిఖీ

మండల కేంద్రంలోని పార్కును ఎంపీడీఓ రాముడు తనిఖీ చేశారు. మొక్కలు, గడ్డి, ఆకులు, చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉండటంపై నిర్వాహకుడిని ఎంపీడీఓ మందలించారు. పరిశుభ్రత, మొక్కల పెరుగుదల, గడ్డి నియంత్రణపై దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉండటం గమనించి ఆరా తీశారు. పాఠశాల సమయంలో విద్యార్థులు బడి బయట ఉండటంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ పాండురంగన్న ఉన్నారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పనివేళల్లో తప్పనిసరిగా ప్రజలకందుబాటులో ఉండాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. సోమ వారం మండలంలోని పులకుర్తి గ్రామ సచివాలయా న్ని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల ఆకస్మి కంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికి వర్తించేలా చూడాలని ఎంపీడీఓ సూచించారు. సచివాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి సమస్యలపై వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఓఆర్డీ మంజుల మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. సోమవారం ఏఓ రవిప్రకాష్ పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిష్టర్లను పరిశీలించడంతో పాటు, మందులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ దుకాణాల్లో రైతులకు విక్రయించే ఎరువులు, మందులు, విత్తనాలకు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అనుమతులు పొంది ఉండాలన్నారు. రైతులు కొనే ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అధిక రేట్లకు విక్రయించినా, అనుమతి లేని మందులను కలిగివున్నా దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కొర్రపంటను పరిశీలించిన ఏఓ..

ఏఓ రవిప్రకాష్ ఆరుతడి కింద సాగు చేసిన కొర్ర పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం కొర్ర పంటలకు సకాలంలో నీటి తడులను కట్టుకోవాలని, పంటకు తెగుళ్లు లేనందున ఎలాంటి మందుల పిచికారీ అవసరం లేదన్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

ఓర్వకల్లు: ఇటీవల అదృశ్యమన స్థానిక ప్రభుత్వ వసతి గృహం విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు.. కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన మునిస్వామి కుమారుడు భాస్కర్ ఓర్వకల్లు ఎస్సీ ప్రభుత్వ హాస్టల్ ఉంటూ జిల్లా పరిషత్ స్కూల్‌లో 9 వ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఇష్టంలేక నాలుగురోజుల క్రితం తండ్రి మునిస్వామికి ఫోన్ చేసి ఇంటికొచ్చేస్తానని చెప్పాడు. అందుకు ఆయన అంగీకరించకపోవడంతో మనస్థాపానికి గురైన భాస్కర్ ఈ నెల 25న హాస్టల్ నుంచి పరారయ్యాడు. వార్డెన్ ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం కర్నూలు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలోని ప్రధాన గేట్ వద్ద విద్యార్థిని గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. హాస్టల్ వార్డెన్ ప్రమీల సమక్షంలో తండ్రి మునిస్వామికి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి పలుకుదొడ్డిలో ఉరుసు

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు బడేసాబ్ ఖాద్రీ ఉరుసు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు సోమ వారం తెలిపారు. మొదటి రోజు మంగళవారం గంధం, బుధవారం ఉరుసు, గురువారం కిస్తీ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

డాక్టర్ ప్రీతి మృతిపై విచారణ జరపాలి



కలెక్టరేట్ ఎదుట నివాళి అర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో వైద్య విద్యను అభ్యసిస్తున్న డాక్టర్ ప్రీతి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కైలాష్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట డాక్టర్ ప్రీతి చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంతో భవిష్యత్ ఉన్న ప్రీతి ర్యాగింగ్ భూతానికి బలవ్వడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో నాయకులు నేనావత్ రాము నాయక్, బాలు నాయక్, రామచంద్రనాయక్, లాయర్‌బాలు నాయక్ పాల్గొన్నారు.